## క్లుప్తంగా

### సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు



జి.మామిడాడలో ప్రత్యేక అలంకరణలో ఉన్న సూర్యదేవుడు, దేవేరులు

**పెదపూడి:** జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని దర్శనానికి ఆదివారం భక్తులు విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో రుత్వికులు ఆలయంలో స్వామి వారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరంలో సేవలు



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి పరీక్షలు చేయించుకుంటున్న జెడ్పీటీసీ రాంబాబు

**రంగంపేట:** మండల పరిధిలోని పెద్ద దొడ్డిగుంట గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కొండేపూడి నాతనియేలు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం మదర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు నూట యాభైమందికి జనరల్ సర్జన్ డాక్టర్ మేఘన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ వైద్య శిబిరంలో నమోదు చేసుకున్న వారికి ఆరు నెలల పాటు ఆసుపత్రిలో కూడా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని మదర్స్ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి కల్లూరి దొరైరాజు, శశిధర్, సన్నీ చార్లెస్ సహకరించారు.

### పాత కోటపాడులో డ్రైనేజీ నిర్మాణం



కోటపాడులో రూ.పది లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైనేజీ

**రంగంపేట:** మండల పరిధిలోని పాత కోటపాడు గ్రామంలో పంచాయితీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులు వేగంగా జరుగుతున్నాయి. గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం నుంచి కృష్ణుడి గుడి వరకు సుమారు రూ.10 లక్షల గ్రామ పంచాయితీ నిధులతో ఈ డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. కొత్త కోటపాడు గ్రామంలో కూడా రూ.5 లక్షల పంచాయతీ నిధులతో డ్రైనేజీ నిర్మించినట్టు గ్రామ సర్పంచ్ గవరసాని లక్ష్మీదుర్గరాజు తెలిపారు. గ్రామంలో డ్రై నేజీల నిర్మాణంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### అమ్మవారి ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ



అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

**అనపర్తి :** శాంతిపురంలో కొలువై ఉన్న శ్రీగణపతి సరస్వతీ సహిత శ్రీమహాలక్ష్మీదేవి అమ్మవారి ఆలయ శిఖర పునఃప్రతిష్ఠా కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. వేద పండితులు మిక్కిలి దుర్గయ్య శాస్త్రి, ఆలయ అర్చకులు అయిలూరి రామకృష్ణ శర్మల పర్యవేక్షణలో రుత్వికులు త్రిమూర్తులు శర్మ కేఎస్ఆర్ ట్రేడర్స్ అధినేత కొవ్వూరి సతీష్‌రెడ్డి, పూర్ణగౌతమి దంపతులచే మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు జరిపించారు. అనంతరం శిఖర ప్రతిష్ఠ గావించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణకర్త తేతలి రామారెడ్డి (అద్దాల కొట్టు రాము), ఎన్‌సీఆర్ మురళీ, పద్మశాలీ సంఘ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### ఘనంగా స్నేహితుల దినోత్సవం

**బిక్కవోలు:** స్నేహితుడు లేనిదే మానవ జీవితానికి పరిపూర్ణత చేకూరదు. ఆదివారం ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా మండలంలోని చిన్నారులు ఒకరికి ఒకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకున్నారు. మానవ సంబంధాలన్నింటిలోనూ స్నేహ బంధమే గొప్పది. ప్రకృతి ప్రసాదించిన బంధం స్నేహమని తెలుపుతో ఫోన్ ద్వారా, వాట్సాప్ ద్వారా శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# మోతాదు మించితే మొదటికే మోసం

- ఎరువుల వినియోగంపై అవగాహన ఉండాలి
- అవసరం మేరకే వాడాలి



పొలంలో ఎరువులను జల్లుతున్న దృశ్యం

**రాజానగరం:** ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతన్నలు అధిక దిగుబడులు సాధించాలనే తపనలో అవసరానికి మించి ఎరువులు, పురుగు మందులను వాడి, నష్టాలను కొనితెచ్చుకుంటున్నారని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు అంటున్నారు. సాగులో ఎరువుల వినియోగంపై అవగాహన పెంచుకోవాలని సూచిస్తున్నారు. తద్వారా మంచి దిగుబడులు పొందటంతోపాటు, భూమి సారాన్ని కాపాడుకోవచ్చంటున్నారు.

వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం దేశంలో గత ఆర్థిక సంవత్సరంలో ఎకరానికి సగటున 56 కిలోల యూరియాను రైతులు వాడారు. అయితే మన జిల్లాలో మాత్రం 90 కిలోలు పైనే వాడటం గమనార్హం. అదే పక్క జిల్లాలైన కాకినాడలో 55 కిలోలు, కోనసీమలో 50 కిలోలు చొప్పున యూరియాను వాడారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయం ద్వారా ఒకవైపు ప్రయత్నాలు చేస్తుంటే జిల్లాలోని రైతులు మాత్రం ఎంత ఎక్కువ ఎరువులను వాడితే అంత ఎక్కువ పంట దిగుబడులు వస్తాయనే భ్రమలో నష్టాల పాలవుతున్నారు. కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం, దివాన్‌చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రాలకు చెందిన శాస్త్రవేత్తలు జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ సాగులో ఎరువుల వినియోగంపై రైతులను చైతన్య పరిచేలా కృషి చేస్తున్నారు.

**అధికంగా వాడడం నష్టమే**

అవసరానికి మించి అధిక మోతాదులో ఎరువులను వినియోగించడం వలన ఎటువంటి ప్రయోజనం ఉండదంటున్నారు. దీనివలన ఖర్చు పెరిగి, రైతులపై ఆర్థిక భారం కూడా పెరుగుతుంది తప్ప, పంట దిగుబడులు పెరగవనే విషయాన్ని గ్రహించాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. జిల్లాలో సుమారు 70 వేల హెక్టార్లలో వరి సాగు జరుగుతుంటే, దీనిలో ఏడు నుంచి పది వేల ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం జరుగుతోం. మరో 30 నుంచి 35 వేల హెక్టార్లలో వివిధ రకాల కషాయలతో తయారుచేసిన ఎరువులను వినియోగిస్తున్నారని వ్యవసాయ శాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది. ఈ కమతాలలోనే మధ్య మధ్యలో యూరియాను కూడా వినియోగిస్తున్నారు.

**భూసారం దెబ్బతింటుంది**

సాధారణంగా పంటకు నత్రజని, భాస్వరం, పొటాష్ నాలుగు లేదా రెండు పాళ్లుగా వాడతారు. కానీ జిల్లాలో చాలామంది రైతులు నత్రజనిని 8 నుంచి 12 పాళ్లు వాడుతున్నారు. దీనివల్ల భూసారం దెబ్బతింటుంది. వరి నాట్లు వేసే సమయంలో 50 కిలోల డీఏపీకి 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ కలపాలి. కానీ కొంతమంది రైతులు ఏకంగా 60 కిలోలు యూరియానే వాడేస్తున్నారు. ఇక నాట్లు వేసిన 30 రోజుల తరువాత రెండో విడతగా ఎకరానికి 25 కిలోల యూరియాను వాడవచ్చు. లేకుంటే పావు లీటరు నానో యూరియాను పిచికారీ చేయవచ్చు. పంట వేసిన 45 రోజుల తరువాత మరోసారి 25 కిలోలు యూరియాతో 15 కిలోలు పొటాష్‌ని కలిపి వాడాలి. లేదంటే అర లీటరు నానో యూరియాను వాడవచ్చు.

– ఎస్.మాధవరావు, జాయింట్ డైరెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ, రాజమహేంద్రవరం

## పేరుకుపోయిన చెత్తతో అవస్థలు



రాజమహేంద్రవరం - సీతానగరం రోడ్డు నుంచి రాపాక వెళ్లే రోడ్డులో పేరుకుపోయిన చెత్త

- రాపాకలో పేరుకుపోయిన చెత్త
- దుర్వాసనతో రోగాల బారిన పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

**సీతానగరం:** మండలంలోని రాపాకలో చెత్త చెదారం పేరుకుపోయింది. గ్రామంలోకి వెళ్లాలంటేనే భయపడే విధంగా రోడ్డుకు ఇరువైపులా చెత్త, చెదారం నిండి ఉంది. పంచాయతీ అధికారులకు ఎంత చెప్పినా ప్రయోజనం శూన్యం. పత్రికలో వచ్చే కథనాలకు స్పందించి ఒక ట్రక్కు మాత్రమే చెత్త తీసి మమ అనిపించారు. గతంలో కలెక్టర్ ఇక్కడ పర్యటించిన సందర్భంగా శానిటేషన్ బాగా లేదని పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేసినా ఇక్కడ మాత్రం మాకేంటి భయం అనే చందంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. రాజమహేంద్రవరం - సీతానగరం ఆర్అండ్‌బీ నుంచి రాపాకలోకి వెళ్ల రహదారికి ఇరువైపులా చెత్త, చెదారం పెద్ద ఎత్తున పేరుకుపోయింది. రాపాక శివారున కోటికేశవరం రోడ్డులోనూ చెత్త పేరుకుపోయింది. దీనిపై పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పేరుకుపోయిన చెత్త దుర్వాసన వెదజల్లుతూ దోమలకు నిలయంగా మారింది. దీంతో పలువురు అనారోగ్యం పాలవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్తను పూర్తి స్థాయిలో తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

## మామూళ్ల నష్టం భర్తీకే బెల్టుషాపులు

- ఒక్క పెదపూడి మండలంలోనే దాదాపు 40 అనధికార బెల్టుషాపులు
- అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

**అనపర్తి :** నెల వారీ ఇస్తున్న మామూళ్ల భర్తీకే గ్రామాల్లో బెల్టుషాపులు విస్తరించి ఇంటింటికి మద్యం అందేలా పాలకులు అనుమతులు ఇచ్చారా అని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రశ్నించారు. ఆదివారం అనపర్తి పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో కఠిన నిబంధనలతో సమయపాలన చేస్తూ అవినీతి రహితంగా లిక్కర్ షాపులు నిర్వహించామని ప్రస్తుతం అనపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపుగా 250 వరకు బెల్టుషాపులు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారని అన్నారు. రాత్రి పగలు తేడా లేకుండా మద్యం అందుబాటులో ఉండడంతో మందుబాబులు నిత్యం మత్తులో ఉంటూ ఆర్థికంగా ఇల్లు, ఆరోగ్య పరంగా ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారన్నారు. యువత నిర్వీర్యం అయిపోతున్నా వారికి పట్టడం లేదన్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మౌనంగా ఉండడం దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు. ఇంటింటికీ పథకాలు అందకపోయినా ప్రతి ఇంటికి మద్యం మాత్రం అందేలా నియోజకవర్గంలో ఏర్పాట్లు చేశారని ఆరోపించారు. మండలాల వారీగా బెల్టు షాపుల వివరాలు బహిర్గతం చేస్తామని స్థానిక ఎమ్మెల్యేకి చిత్తశుద్ధి ఉంటే వాటిని మూసివేయించి తన సచ్ఛీలతను నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పెదపూడి మండలంలోని గండ్రేడు, పుట్టకొండ, పెదపూడి, కరకుదురు, శహపురం, కాండ్రేగుల, సంపర, జి.మామిడాడ, పెద్దాడ, కైకవోలు, కుమారప్రియం, చింతపల్లి, వేండ్ర, ఏపీత్రయం, రామేశ్వరం తదితర గ్రామాలలో నిర్వహిస్తున్న అనధికార బెల్టుషాపుల వివరాల లిస్టును మీడియాకు విడుదల చేశారు.

## పేపర్ మిల్లు కాలుష్యం నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలి

రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్

**రాజమహేంద్రవరం సిటీ:** ఏపీ పేపరుమిల్లు కాలుష్యం నుంచి గోదావరి జలాలను రక్షించి రాజమహేంద్రవరం నగర ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో ఆర్పీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ నగర పరిసర ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యాలు క్షీణించటానికి ఆంధ్రప్రదేశ్ పేపర్ మిల్లు నుంచి విడుదలయ్యే ప్రమాదకరమైన రసాయినాలే ప్రధాన కారణమన్నారు. నగర పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అందరు ఏదో ఒక అనారోగ్య సమస్యలతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారంటే అందుకు పేపర్ మిల్లు నిర్లక్ష్యం కారణమన్నారు. గోదావరి జలాలు విషపూరితంగా మారి తాగునీరు కలుషితం అవుతున్నా సంబంధిత యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం వెనుక భారిగా అవినీతి ముడుపులు నడుస్తున్నాయని ఆరోపించారు. పేపర్ మిల్లులో ప్రస్తుతం పని చేస్తున్న అనేక యంత్రాలు కాలం చెల్లినవని, ఏ రోజు ఏ ప్రమాదం జరుగుతుందో, ప్రాణ నష్టం సంభవిస్తుందో తెలియని ఆందోళనతో కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు ప్రధాన రాజకీయ పార్టీలు కార్మికుల జీవితాలను మిల్లు యాజమాన్యానికి అమ్మేస్తున్నాయన్నారు.కాలుష్య నియంత్రణ శాఖ ఎవరి కోసం పని చేస్తుందో అర్థం కావటం లేదన్నారు.

## మన ఆరోగ్యం మన చేతుల్లోనే..



కార్యవర్గ సమావేశంలో పీఎంపీ అసోసియేషన్ నాయకులు

**కంబాలచెరువు:** మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, మనందరం ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం చాలా ముఖ్యమని పీఎంపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు అన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గ సమావేశం రాజమండ్రిలోని ఒక రెస్టారెంట్‌లో ఆదివారం జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. దీనికి హాజరైన జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ పీఎంపీలు ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రజలను జాగృతం చేయాలన్నారు. జీవీఎస్‌కే న్యూట్రాసిటికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కుమార్ పైడికొండల మాట్లాడుతూ భారతదేశంలో 70 వేల ఆయుర్వేద మొక్కలు ఉన్నాయని, వాటిని ఉపయోగిస్తూ అందించే ఔషధాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ పీఎంపీలు ప్రాథమిక వైద్య సేవలతో పాటు సామాజిక సేవలలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా పీఎంపీలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జిల్లా కార్యదర్శి పి.దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, ఉపాధ్యక్షులు రహమాన్‌ఖాన్, సహాయ కార్యదర్శి ఏ.ధనుంజయ్, గౌరవ అధ్యక్షుడు బుద్దిగ అప్పారావు, రాజమండ్రి కార్యదర్శి మట్టా రమేష్, కోశాధికారి యు.ప్రసాద్ బాబు, జిల్లా లోని అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శి కోశాధికారులు హాజరయ్యారు.

## కష్టపడే వారికి ఎప్పుడూ గుర్తింపు

మాజీ హోం మంత్రి తానేటి వనిత



మాజీ హోం మంత్రి వనితను కలసిన వైఎస్సార్ సీపీ నల్లజర్ల నాయకులు

**నల్లజర్ల:** పార్టీలో కష్టపడి పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని, అందుకు వామిశెట్టి పరమేశ్వరరావు, పావనీకుమారి నిదర్శనమని మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్ తానేటి వనిత అన్నారు. రాష్ట్ర సోషల్ మీడియా విభాగం కార్యదర్శిగా వామిశెట్టి పరమేశ్వరరావు, పబ్లిసిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా సింగరాజుపాలెం ఎంపీటీసీ వామిశెట్టి పావనీకుమారికి పార్టీ కేంద్ర కార్యాలయం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వీరిద్దరూ మాజీ మంత్రి వనితను కలసి కృతజ్ఞతలు తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా వనిత పార్టీ నాయకులకు రాఖీలు కట్టి తమ అనుబంధాన్ని చాటుకున్నారు. ఆమెను కలసిన వారిలో పార్టీ మండల కన్వీనర్ వెల్లంకి వెంకటసుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, మండల మహిళా అధ్యక్షురాలు యజ్జవరపు లక్ష్మిగాంధీ, జిల్లా కార్యదర్శి ముప్పిడి వెంకటరత్నం, సయ్యద్ మునాఫ్, పిచ్చుకుల ప్రసాద్, బళ్ల నాని, ప్రత్తి శ్రీనుబాబు, పెనుమాక వెంకటరత్నం, ప్రత్తి మురళీకృష్ణ, జాలాది రవి, ప్రగడ వెంకటేశ్వరరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు శ్రీకాకుళపు ఆదిత్య, చిన్నీ నాగూయాదవ్, తాడిగడప శ్రీనివాసరావు, భీమడోలు వెంకటేశ్వరరావు, చిట్లా వెంకటేశ్వరరావు, చేబ్రోలు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

### 61 మద్యం సీసాలు స్వాధీనం

**సీతానగరం :** మండలంలోని బొబ్బిల్లంకకు చెందిన వీరమళ్ళ శివ నుంచి 61 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ ఆకుల వీరవెంకట సత్యనారాయణ ఆదివారం తెలిపారు. బొబ్బిల్లంకలోని శివ ఇంటివద్ద మద్యం అమ్ముతుండగా దాడి చేసి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. బీరు బాటిల్స్ 2, క్లాసిక్ బ్లూ, మెక్‌డాల్స్, మేన్‌షన్ హౌస్, ఓల్డ్ ఎడ్మైరల్ వంటి పలు రకాల 180 ఎమ్ఎల్ మద్యం సీసాలు 61 స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.10,630 ఉంటుందని అంచనా, శివపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని హెడ్ కానిస్టేబుల్ వీర వెంకట సత్యనారాయణ తెలిపారు.

### కరాటే టెస్ట్ విజేతలకు బెల్టుల అందజేత

**రాజమహేంద్రవరం రూరల్:** కవలగొయ్యి గ్రామంలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎలెట్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ పంచికట్ల శ్రీనువాస్ ఆదివారం కరాటే టెస్టు నిర్వహించారు. అందులో ఎనిమిది మంది పాల్గొనగా ఇద్దరు విజయం సాధించారు. పెయ్యల నక్షిక తన్వి, శ్రీ.మట్టా పద్మ తేజస్వి బెల్ట్ టెస్ట్‌లో విజయం సాధించారు. విజేతలకు ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ అధ్యాపకులు, విద్యావేత్త చెల్లూరి రాజరంజిత్ రత్నకుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు, బెల్టులు అందచేశారు.

### ఆర్యవైశ్యులు అభివృద్ధి సాధించాలి

**చాగల్లు:** ఐక్యంగా ఉండి ఆర్యవైశ్యులంతా అన్ని విధాలా అభివృద్ధి సాధించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీరామమూర్తి అన్నారు. స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ఆదివారం ఆర్యవైశ్యుల మండల నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథి శ్రీరామమూర్తి మాట్లాడుతూ, ఆర్యవైశ్యులు సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. సంఘ నూతన మండల అధ్యక్షుడిగా పెంజర్ల ఉమ్మాజి, కార్యదర్శిగా చిక్కాల గ్రామానికి చెందిన పి.శ్రీనివాస్, కోశాధికారిగా ఊనగట్ల గ్రామానికి చెందిన నారాయణ సత్యనారాయణతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్రంధి రాంబాబు, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఈసీసీ సభ్యులు చీమకుర్తి ప్రసాద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

### అసభ్య ప్రవర్తనపై కేసు

**నిడదవోలు రూరల్:** వివాహితతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు ఆదివారం తెలిపారు. మండలంలోని జీడిగుంట గ్రామానికి చెందిన వివాహితను అదే గ్రామానికి చెందిన ఊబా సీతయ్య కొంతకాలంగా వేధిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఆమెకు అతడు అసభ్యకర రీతిలో సైగలు చేశాడు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### పేకాట స్థావరంపై దాడి

**దేవరపల్లి:** మండలంలోని లక్ష్మీపురంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఆరుగురిని అరెస్ట్ చేసి, రూ.14,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ బీఎస్ నాయక్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో చిన్నారికి తీవ్ర గాయాలు

**నిడదవోలు:** పట్టణంలో చర్చిపేట ప్రభుత్వాస్పత్రి వద్ద ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడేళ్ల బత్తుల రత్నం అనే చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక సంత మార్కెట్ వీధిలో నివసిస్తున్న బత్తుల కనకయ్య, చిట్టమ్మ దంపతులు తమ చిన్నారి రత్నంను తీసుకుని గణపతి సెంటర్‌లో ఉన్న మార్కెట్‌కు బైక్‌పై బయలుదేరారు. ఆస్పత్రి ప్రధాన రోడ్డు మలుపు వద్ద గణపతి సెంటర్ నుంచి వచ్చిన కారు వేగంగా వారి మోటార్ బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న దంపతులతో పాటు, చిన్నారి కూడా కింద పడిపోయింది. దీంతో చిన్నారికి తీవ్ర గాయాలు కాగా, దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చిన్నారి రత్నం అక్కడ చికిత్స పొందుతోంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ సంఘటన స్థలం నుంచి కారును తీసుకుని పరారయ్యాడు.

# డాక్టర్లు లేక.. మందులు అందక..

- నగర పాలక సంస్థ ఫస్ట్ రిఫరల్ యూనిట్ నిర్వీర్యం
- పట్టించుకోని అధికారులు
- పేద మహిళల పట్ల పాలిట శాపంగా మారిన వైనం



రోగులు లేకపోవడంతో నిరుపయోగంగా మంచాలు

**రాజమహేంద్రవరం సిటీ:** నగర పాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం వల్ల దశాబ్దాల తరబడి మహిళల సుఖ ప్రసవాలకు సేవలు అందించిన ఫస్ట్ రిఫరల్ యూనిట్ నిర్వీర్యమైపోయింది. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఫస్ట్ రిఫరల్ యూనిట్ సరైన దిశా నిర్దేశం, పర్యవేక్షణ లేకపోవడంతో నామమాత్రపు సేవలకు పరిమితమైపోయింది. సుఖ ప్రసవానికి, ట్యూబెక్టమీ ఆపరేషన్లు, కుక్కకాటుకు మందు, చిన్న పిల్లలకు టీకాలు, ఇక్కడ లభ్యమయ్యేవి. ఇక్కడి డాక్టర్లను వేరే ప్రాంతాలకు బదిలీ చేసి కేవలం ఆయుర్వేద వైద్యానికి ఈ యూనిట్‌ను పరిమితం చేశారు. రామచంద్రరావు పేట, తుమ్మలావ, పేపర్ మిల్ ఏరియా, ఆర్యాపురం, కోటిలింగాల పేట, సీతంపేటల నుంచి నిత్యం 80 నుంచి 100 మంది వరకు మహిళలు ఇక్కడికి వచ్చేవారు. అయితే నగరపాలక సంస్థకు ఎన్నికలు జరగకపోవడం, పాలకమండలి ఏర్పాటు కాకపోవడంతో అధికారుల ఇష్టారాజ్యంగా మారిపోయింది. అవసరమైన వైద్యులు, వైద్య పరికరాలు, మందులు అందించే చర్యలు చేపట్టకపోవడంతో ఇది నామమాత్రపు ఆసుపత్రిగా మారిపోయింది. ఇక్కడ అల్లోపతి వైద్య సేవలు అందడం లేదని స్థానికులు వాపోతున్నారు. మెటర్నిటీ సేవలందించే డాక్టరు నియామకం లేకపోవడంతో వైద్యం దాదాపు కనుమరుగై పోయింది. సిబ్బంది అరకొరగా ఉంటూ నామమాత్రపు వైద్య సేవలు అందిస్తున్నారు. వైద్యం అందకపోవడంతో స్థానికంగా పేద మధ్యతరగతి వర్గాలకు చెందిన ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గర్భిణులు, బాలింతలు ప్రభుత్వాసుపత్రికి వెళ్లాల్సి వచ్చి తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇదే ఆసుపత్రిలో వైద్య సేవలను అందించే అల్లోపతి వైద్యురాల్ని ఏర్పాటు చేయకుండా ఆయుర్వేద వైద్యాన్ని అందించేందుకు డాక్టరును నియమించారు. ఆయుర్వేద వైద్యం కోసం వచ్చిన రోగులు మందులు లేకపోవడంతో నిరాశతో తిరిగి వెళ్లిపోయే పరిస్థితి నెలకొంది.

**డిప్యూటేషన్‌పై డాక్టర్‌ను నియమించాలి**

కరోనా సమయంలో 2018 నుంచి 2021 వరకూ గోకవరం ప్రభుత్వాసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ వనజాకుమారిని ఫస్ట్ రిఫరల్ యూనిట్‌లో వైద్యసేవల కోసమై నియమించారు. అప్పట్లో ఈ హాస్పిటల్లో నెలకు సుమారు 15 సుఖప్రసవాలు, సుమారు 40 ట్యూబెక్టమీ ఆపరేషన్లు నిర్వహించేవారు. అయితే కరోనా అనంతరం గైనకాజిస్ట్ డిప్యూటేషన్ రద్దు చేయడంతో గోకవరం తిరిగి వెళ్లిపోయారు. అప్పటి నుంచి హస్పిటల్లో ప్రసవానికి వచ్చే మహిళలకు కష్టాలు ప్రారంభమయ్యాయి. కలెక్టర్, నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో వారానికి మూడు రోజులపాటు డిప్యూటేషన్‌పై గైనకాలజిస్టును తీసుకుని వస్తే మహిళలు ఇబ్బందులు గట్టెక్కి హాస్పిటల్‌కు పూర్వ వైభవం వస్తుందని స్థానిక మహిళలు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.




నగర పాలక సంస్థ ఫస్ట్ రిఫరల్ యూనిట్

**నిరుపయోగంగా మంచాలు**

ఆసుపత్రిలో మహిళలకు వైద్య సేవలు కనుమరుగవ్వడం, గర్భిణులకు వైద్య సేవలు ఏమాత్రం అందకపోవడంతో వారికోసం ఏర్పాటు చేసిన మంచాలు నిరుపయోగంగా మూలన పడ్డాయి.

### మహిళా వైద్యురాలిని నియమించాలి



సుమారు 60 సంవత్సరాలు ఫస్ట్ రిఫరల్ హాస్పిటల్‌గా సేవలందించిన ఆసుపత్రిలో మహిళలకు కనీసం వైద్యం అందచేయకపోవడం దారుణం. గర్భిణులకు ప్రత్యేక వైద్య సదుపాయాలు కలిగిన ఆసుపత్రిగా పేరొందిన ఆసుపత్రిలో నగర పాలక సంస్థ అధికారులు వైద్య సేవలు అందించేందుకు ఏమాత్రం దృష్టి పెట్టకపోవడం విడ్డూరం. ప్రైవేట్ ఆసుపత్రులను ప్రోత్సహించేందుకు నగరపాలక సంస్థ పర్యవేక్షణ అధికారులు ఫస్ట్ రిఫరల్ హాస్పిటల్‌ను బలహీనం చేసే చర్యలు చేపట్టడం దౌర్భాగ్యం. ఇప్పటికైనా కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించి పేదలకు మహిళలకు వైద్య సేవలు అందించేందుకు డాక్టర్‌ను నియమించాలి.

– కే.దేవిక క్రాంతి, అధ్యాపకురాలు, రాజమహేంద్రవరం

### పేదలకు వైద్యం అందించకపోవడం దారుణం



స్థానికంగా ఫస్ట్ రిఫరల్ ఆస్పత్రిలో వైద్యం అందే పరిస్థితి లేకపోవడంతో ప్రభుత్వాసుపత్రికి వెళ్లి రావాలంటే ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. ఈ ఆసుపత్రిలో వైద్య సేవలు అందించే విధంగా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టాలి. పేదలు అత్యధికంగా నివసించే ఈ ప్రాంతంలో ఫస్ట్ రిఫరల్ ఆసుపత్రి సేవలు ఎంతో అత్యవసరం. ఈ విషయాన్ని మహిళా కలెక్టర్ గుర్తించి వైద్యులను నియమించే చర్యలు చేపట్టాలి.

– వానపల్లి రేవతి, ఆదర్శ మహిళా సంఘం సభ్యురాలు, రాజమహేంద్రవరం